ఖరీఫ్‌లో వర్షాభావం చేత రైతన్నలు పంటలు సాగు చేయలేకపోయారు. కనీసం రబీలో అయినా పంట పండించుకుందాం అనుకున్నాడు రైతన్న. రబీలో ఎగువున కురిసిన వర్షాలకు కాల్వల్లో నీరు సమృద్ధిగా పారాయి. అంతా బాగుందనుకుంటున్న తరుణంలో నోటికాడి కూడును ప్రకృతి దేవుడు గద్దలా తన్నుకుపోయాడు. అతివృష్టి కారణంగా వరి చేలు నేలకొరగడంతో దిగుబడులు వచ్చేలా లేవు. పుండు మీద కారం చల్లినట్లుగా కూటమి ప్రభుత్వం ఒక్క పైసా కూడా నష్టపరిహారం కాని, అన్నదాత సుఖీభవ సాయం కాని అందించిన దాఖలాలు లేవు.


కారంచేడు-ఆదిపూడి రోడ్డులో నేలకొరిగిన వరిచేలు


స్వర్ణ-కారంచేడు రోడ్డులో నేలకొరిగిన వరిపంట

- తుఫాను గాలులు, మంచుతో వరికి తీవ్ర నష్టం
- పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో నష్టపోయిన రైతులు
- ఎకరాకు 30–35 శాతం నేలకొరిగిన వైనం
- లక్ష ఎకరాల్లో వరి సాగు
- పెట్టుబడులు కూడా రావంటున్న అన్నదాతలు
- ఆదుకోని కూటమి ప్రభుత్వం

వర్రీయే..!

కారంచేడు: ప్రతి ఏటా అన్నదాతలను ప్రకృతి వైపరీత్యాలు వెంటాడుతూనే ఉంటాయి. ఒకసారి పంట సాగు సమయంలో, మరోసారి పంటల సాగు ముమ్మరంగా సాగుతున్న వేళల్లో, మరికొన్ని సాగు పంటలు చేతికందే సమయాన, ఇంకొన్ని సమయాల్లో కోతలకు సిద్ధమైన తరుణంలో ప్రకృతి ప్రకోపానికి గురవతున్నాడు రైతన్న. ఈ ఏడాది ఇలాంటి విపత్కర పరిస్థితులను చవిచూడాల్సిన దుస్థితి వచ్చిందని అన్నదాతలు వాపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు ప్రస్తుతం పొట్ట, కంకి దశల్లో ఉన్నాయి. రాత్రనక, పగలనక కష్టపడి సాగుచేసుకున్న వరి చేలు నేల చూపులు చూస్తుండటంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. డిసెంబర్ నెలాఖరులో వచ్చిన తుఫాను, వీచిన చలి గాలులతో పాటు, దట్టంగా కురుస్తున్న పొగమంచు రైతన్నలకు శాపంగా మారాయి. దీనికి తోడు ఈ ప్రాంతంలో ఎక్కువగా సాగు చేసే 2270 రకం విత్తనాలు మొక్క ఏపుగా పెరుగుండే గుణం కలిగి ఉండటం, కంకి బరువుకు కూడా పంట చేలు నేలకు బొక్కబోర్లా పడిపోయాయని రైతులు చెప్తున్నారు.

కొమ్మమూరు ఆయకట్టు రైతుల ఆవేదన..

కృష్ణా రైట్ కెనాల్‌గా పిలువబడుతూ బాపట్ల జిల్లా ప్రారంభం నుంచి కొమ్మమూరు కాలువగా ఉన్న బకింగ్‌హామ్ కెనాల్ (కృష్ణ కాలువ) కింద సుమారు ఈ ప్రాంతంలో లక్ష ఎకరాల్లో వరి సాగుచేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రెండు నియోజకవర్గాల పరిధిలోని కారంచేడు, పర్చూరు, చీరాల, వేటపాలెం, చినగంజాం, ఇంకొల్లు, నాగులుప్పలపాడు మండలాల్లో వరిని సాగు చేశారు. కారంచేడు మండలంలోని ఉత్తర పొలాలు, దక్షిణ పొలాలతో పాటు, చీరాల మండలంలోని వాద పొలాలు, ఈ కాలువ చివరి సాగు భూములుగా ఉన్నాయి. ఈ ఏడాది ప్రకృతి కరుణించి వర్షాలు కురవడంతో అనుకన్న సమయం కన్నా కొద్దిగా ఆలస్యంగా రైతులు వరిసాగును ప్రారంభించారు. ప్రస్తుతం కారంచేడు మండలంలోని కుంకలమర్రు, స్వర్ణ, కారంచేడు, రంగప్పనాయుడువారిపాలెం, తిమిడెపాడు, ఆదిపూడి ప్రాంతాలలోని వరి చేలు ఎక్కువ శాతం నష్టపోయాయి.



వరి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి..

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో నేలకొరిగిన వరి చేల వలన పంట చాలా నష్టపోవాల్సి వస్తుంది. రైతులు నష్టపోయిన పంటలకు నష్ట పరిహారంగా అందించి సహకారం అందించాలి. లేకపోతే కనీసం పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితులున్నాయి. వేల ఎకరాల్లో వరి సాగులో రైతులు నష్టపోతున్నారు.

– దగ్గుబాటి శ్రీనివాసరావు, రైతు, కారంచేడు

పంట దిగుబడులు, ధరలపైనే ఆశ ..

ఇలాంటి పరిస్థితుల్లో వరి సాగులో ఎంత వరకు పెట్టిన పెట్టుబడులు చేతికందుతాయో తెలియని పరిస్థితులున్నాయని రైతులు వాపోతున్నారు. ఎకరానికి సుమారు రూ.20–25 వేల వరకు భూముల కౌలు చెల్లింపులు ఉంటే, సాగు పెట్టుబడుల కోసం మరో రూ.30 వేల వరకు ఖర్చు చేశామని రైతులు చెప్తున్నారు. గత ప్రభుత్వ పాలనలో సాగు కోసం పెట్టుబడి సాయం కింద రైతులకు ఎకరానికి రూ.16500 వరకు వచ్చేవి. ఈ ఏడాది కనీసం పెట్టుబడులకు అవసరమైన సాయం కూడా ప్రభుత్వం నుంచి అందకపోవడం కూడా రైతులకు నష్టం కలిగించే పరిణామంగా మారాయి. ఎకరానికి ఎనీసం రూ.50–60 వేల వరకు ఖర్చు చేశామని చెప్తున్న రైతులకు దిగుబడులు ఆశా జనకంగా మారతాయా లేదా అని ఆలోచనలో పడ్డారు.

ప్రభుత్వం ఆదుకోకపోతే రైతులకు నష్టమే..

ప్రస్తుత పరిస్థితుల్లో వరి సాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే పెట్టిన పెట్టుబడులు రాక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రైతులు చెప్తున్నారు. వరి చేలల్లోని పంట నేలకు ఒరిగిపోవడం వలన దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందని చెప్తున్నారు. ఎకరానికి కనీసం 10–20 బస్తాల వరకు నష్టం జరిగే అవకాశం ఉందని వారు వాపోతున్నారు. ఎకరానికి 30 బస్తాలైనా వస్తాయని ఆశించిన రైతుల ఆశలు అడియాసలుగానే మిగిలే పరిస్థితులు ఉన్నాయని వారు లబోదిబోమంటున్నారు.

అదే సీఎంగా జగన్ మోహన్‌రెడ్డి ఉండి ఉంటే..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అన్నదాత సుఖీభవ పథకం కింది ప్రతి రైతుకు రూ.20 వేలు అందిస్తామని గొప్పలు చెప్పింది. తీరా అధికారంలోకి వచ్చాక ఖజానలో డబ్బుల్లేవు అంటూ రైతుకు పంగనామాలు పెట్టారు. అదే సీఎంగా జగన్ ఉంటే ఈపాటికి ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతు భరోసా సాయం రైతుల ఖాతాల్లోకి జమయ్యేవి. పురుగు మందులు, ఎరువులు, యంత్రాలు, సబ్సిడీపై అందించేది. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ప్రతి రైతును ఆదుకొనే విధంగా రైతుల ఖాతాల్లో పంటలను బట్టి నష్టపరిహారం వేగంగా అందేది. కాని ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో మాత్రం అందని ద్రాక్షగానే మిగిలిపోతుందేమోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వరి పంట నష్టం వచ్చేలా ఉంది..

వరి సాగుతో ఈ ఏడాది పంటల దిగుబడిలో తేడాలు వచ్చే అవకాశం ఉంది. కారణం గత ఏడాది చివరిలో వచ్చిన తుఫాన్ గాలులు, తీవ్రమైన పొగమంచుతో వరి పంట పూర్తిగా నేలమట్టంగా మారింది. ఎకరా సాగులో కనీసం 30 శాతం చేను నేలమట్టం అయ్యింది. దీంతో కనీసం 5–10 బస్తాల ధాన్యం దిగుబడులు కూడా తగ్గే అవకాశం ఉంది.

– యార్లగడ్డ సుబ్బారావు, రైతు, కారంచేడు

క్లుప్తంగా

ఫిబ్రవరి 28లోగా లైఫ్ సర్టిఫికెట్లు అందించాలి

చీరాల టౌన్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉప ఖజానా కార్యాలయం నుంచి ప్రతి నెల పింఛన్ తీసుకునే విశ్రాంత ఉద్యోగులు విధిగా లైఫ్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి 28లోగా ఉపఖజానా కార్యాలయంలో అందించాలని ఎస్టీవో సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చీరాల ఉపఖజానా కార్యాలయ పరిధిలోని చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు, పర్చూరు, ఇంకొల్లు మండలాలలకు చెందిన ఉద్యోగులకు జీతాల బిల్లులు త్వరగా పంపిస్తున్నామన్నారు. ఉప ఖజానా కార్యాలయ పరిధిలో ఉన్న 3395 మంది విశ్రాంత ఉద్యోగులు తమ లైఫ్ సర్టిఫికెట్లను ఫిబ్రవరి 28లోగా ఉప ఖజానా కార్యాలయంలో అందించాలన్నారు. అలానే 52 మంది ఈ–కేవైసీ చేయించుకోవాల్సిన వారు ఉన్నారని, వారు కూడా త్వరగా చేయించుకోవాలన్నారు.

ఆదర్శ ఉద్యోగులకు అభినందనలు



అద్దంకి రూరల్: డిపో పరిధిలో ఎక్కువ ఆదాయం, ఎక్కువ కేఎంపీఎల్ తెచ్చిన ఉద్యోగులను ఆదర్శ ఉద్యోగులుగా గుర్తించి వారిని డీఎం రామ్మోహనరావు మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా గ్యారేజి ఆవరణలో జరిగిన అభినందన సభలో ఉద్యోగులను సన్మానించారు. సూపర్ లగ్జరీలో ఎం శేషయ్య, ఎక్స్‌ప్రెస్‌లో యూఎస్ రావు, పల్లె వెలుగులో మహేశ్వరీలు అధిక ఆదాయం తీసుకువచ్చారని తెలిపారు. అలాగే అధిక కేఎంపీఎల్ తెచ్చిన బీ. శ్రీరాములు, ఎంఎస్ మణ్యంలను అభినందించారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

మేదరమెట్ల: ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమవడంతో రైతు నష్టపోయాడు. కొరిశపాడు మండలంలోని బొడ్డువానిపాలెం గ్రామానికి చెందిన దేవరపల్లి అశోక్‌రెడ్డికి చెందిన పొగాకు బ్యారన్ మంగళవారం కాలిపోయింది. ప్రమాదవశాత్తు బ్యారన్‌లో మంటలు వ్యాపించడంతో పొగాకు పూర్తిగా ఆహుతయింది. సమాచారం అందుకున్న అద్దంకి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పివేశారు. ఈప్రమాదంలో రూ.5 లక్షల విలువ చేసే పొగాకుతో పాటు కర్రలు కాలిపోయాయని బాధితుడు తెలిపాడు.

9 నుంచి కార్యకర్తలకు అందుబాటులో గాదె

చినగంజాం: పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా గాదె మధుసూదనరెడ్డిని ఇటీవల పార్టీ కేంద్ర కార్యాలయం నియమించింది. ఈ సందర్భంగా ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు ఇంకొల్లు మండలం పావులూరులోని తన స్వగృహంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన మధుసూదన్‌రెడ్డి


మాజీ సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మధుసూదనరెడ్డి

చినగంజాం: మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి మంగళవారం తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అలానే ఆయనతో పాటు నియోజకవర్గంలోని ఆరు మండలాల కన్వీనర్లు పావులూరు వైస్ సర్పంచ్ పులఖండం వెంకారెడ్డి, పావులూరు సర్పంచ్ బొల్లెద్దు లుదియమ్మ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ పులఖండం రామకృష్ణారెడ్డి, తలకాయల కోటేశ్వరరావు, చినగంజాం మండల కన్వీనర్ మున్నం నాగేశ్వరరెడ్డి, ఇంకొల్లు మండల కన్వీనర్ బండారు ప్రభాకరరావు, మార్టూరు మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, పర్చూరు మండల కన్వీనర్ కఠారి అప్పారావు, కారంచేడు మండల కన్వీనర్ దండా చౌదరిలు కలిశారు.

170 మందికి వైద్య పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ గోపీవర్మ

కర్లపాలెం: గ్రామీణ ప్రాంత ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను వినియోగించుకోవాలని చీరాల అపోలో హాస్పిటల్ వైద్యులు డాక్టర్ రవికిరణ్, గోపివర్మలు చెప్పారు. మంగళవారం కర్లపాలెం ఆర్య వైశ్య కల్యాణ మండపంలో చీరాల అపోలో హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ రంగనాథ్, గోపివర్మ, సజ్జ, కావ్యారెడ్డిలు సుమారు 170 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈసందర్భంగా హాస్పిటల్ మేనేజర్ గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ చీరాలలో ఏర్పాటు చేసిన తమ వైద్యశాలలో 24 గంటలూ వైద్యులు అందుబాటులో ఉంటారని, మెరుగైన వైద్య సేవలందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నేతలు తూనుగుంట్ల సుబ్బారావు, లలితబాబు తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులో అధికారులకు చేదు అనుభవం


- ముగిసిన రెవెన్యూ సదస్సులు

బల్లికురవ: ప్రభుత్వం సెంటు భూమి లేని తమకు అసైన్డ్ భూమి ఇచ్చి దశాబ్దాలు గడుస్తున్నా అన్యాక్రాంతం నుంచి విముక్తి కల్పించడం లేదని రెవెన్యూ సదస్సులో అధికాలను నిలదీశారు. మంగళవారం మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సులో సీపీఎం కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు, ఎస్సీ,ఎస్టీ రైతు నాయకులు పావులూరి రమణయ్య, గొల్లపూడి అంజయ్య, మరో 40 మంది రైతులు తహసీల్దార్ రవినాయక్‌కు వినతి ప్రతం అందించారు. సర్వే నంబర్ 295,297, 306 లో మూడు విడతల్లో సుమారు 300 మంది రైతులకు అటవీ భూమిని తలా అరెకరం చొప్పున పట్టాలిచ్చారన్నారు. వీరిలో కొందరి భూమిని అగ్రవర్ణాలకు చెందిన రైతులు ఆక్రమించుకున్నారని ఈ విషయాన్ని 10 సంవత్సరాలుగా అధికారుల దృష్టికి తెస్తున్నామని చెప్పారు. దీనిపై ఎలాంటి చర్యలు లేవని దళిత రైతులను భూముల్లోకి రానివ్వడం లేదని వినతి పత్రం అందజేశారు. కొందరు గిరిజనులు ఆ. దీనంలో ఉన్న భూములను ఆన్‌లైన్ చేయకుండా వేధిస్తున్నారన్నారు. భూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేకుంటే జిల్లా కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల ముందు ధర్నా చేపడతామని వెంకటేశ్వర్లు హెచ్చరించారు. భూములను పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

235 అర్జీలు స్వీకరణ

బల్లికురవ: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన సమస్యలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. మండలంలోని 14 రెవెన్యూల గ్రామాల్లో డిసెంబర్ 6 ప్రారంభమైన ఈ సదస్సులో మొత్తం 235 అర్జీలు అందినట్లు రవినాయక్ తెలిపారు. వీటిలో 160 అర్జీలు పరిష్కరించామని 75 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని, వీటిలో సర్వే కొలతకు 45, భూములను సంబంధించి 30 అర్జీలు పెండింగ్‌లో ఉన్నట్లు తహసీల్దార్ వివరించారు.

24 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ


రైతులతో మాట్లాడుతున్న ఏవో లావణ్య

సంతమాగులూరు (అద్దంకి): మండలంలోని మూడు గ్రామాల్లో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని ఏవో లావణ్య పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆమె మంగళవారం మండలంలోని కొప్పరం గ్రామంలో ఆమె కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మూడు కేంద్రాల్లో ఏల్చూరు పీఏసీఎస్ పరిధిలో ఇప్పటికి 24 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని వెల్లడించారు. దానికి సంబంధించిన నగదు రైతులకు రెండు రోజుల్లో వారి ఖాతాలకు జమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయాధికారులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

10న మండల సర్వసభ్య సమావేశం

కారంచేడు: ఈ నెల 10వ తేదీన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కే నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ నీరుకట్టు వాసుబాబు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో ఉదయం 10.30 గంటల నుంచి ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యురాలితో పాటు, మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తప్పకుండా హాజరు కావాలన్నారు. అలాగే అన్ని శాఖల అధికారులు తమ శాఖల పనితీరును, ప్రగతిని వెంట తెచ్చుకోవాలని ఆయన కోరారు.

ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలి



సిబ్బందికి సూచనలు, సలహాలు అందిస్తున్న డాక్టర్ చిట్టిబాబు

మేదరమెట్ల: వైద్య, ఆరోగ్య శాఖకు చెందిన ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని యర్రం చినపోలిరెడ్డి ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ చిట్టిబాబు అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో గల ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వైద్య సిబ్బందికి సూచనలు సలహాలను అందచేశారు. వ్యాధినిరోధక టీకాలను క్రమం తప్పకుండా వేయాలని గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేస్తూ తగిన జాగ్రత్తలను తెలియచేయడం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్కూల్ కార్యక్రమంలో విస్తరణాధికారులు ఎస్‌కేఎం జానీ, బ్రహ్మనందం, పీహెచ్ఎన్ సుశీల, సూపర్‌వైజర్ పద్మావతి, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

న్యాయమూర్తులను కలసిన మహిళా న్యాయవాదులు

చీరాల రూరల్ : చీరాల కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న మహిళా న్యాయవాదులు మంగళవారం మహిళా న్యాయమూర్తులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ రెహానా, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి షేక్ నిషాద్ నాజ్‌లకు పుష్పగుచ్చం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి జేకే ఈశ్వరిరెడ్డి, న్యాయవాదులు ఎస్‌డి. కరుణకుమారి, శారద, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద దివ్యాంగులకు చేయూత


దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

చీరాల అర్బన్: నిరుపేద దివ్యాంగులకు దాతలు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. లెట్స్ హెల్ప్ ఆర్గనేజేషన్ చీరాల ఆధ్వర్యంలో ఎన్ఆర్ఐ రామిశెట్టి దిలీప్ కుమార్, అనూష దంపతుల సహకారంతో మంగళవారం చీరాలలో పంపిణీ చేశారు. చీరాల వైకుంఠపురానికి చెందిన ధనలక్ష్మి, తోటవారిపాలెం భావనారుషిపేటకు చెందిన సాయి అనే దివ్యాంగులకు సంస్థ ప్రతినిధి కనపర్తి కిరణ్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో డేవిడ్, దయాకర్, రాజేష్, సాంబయ్య, ప్రకాష్, సుభాని, మధు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫౌంటెన్‌కు మరమ్మతులు


నీరు విరజల్లుతున్న ఫౌంటెన్

సాక్షి ఎఫెక్ట్..

చీరాల రూరల్: స్థానిక రైల్వే స్టేషన్ వద్దగల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ముందు ఏర్పాటు చేసిన నీటి ఫౌంటెన్‌లకు మరమ్మతులు చేయించంటూ సాక్షిలో సోమవారం వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు మున్సిపల్ ఏఈ రవికుమార్ దగ్గరుండి సిబ్బందితో పనులు పూర్తిచేయించారు. అలానే విగ్రహం కింది భాగంలో ఉన్న చెత్తా చెదారాలను కార్మికులతో పూర్తిగా తొలగించారు. దీనిపై దళిత, ప్రజా సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఒక్క రోజులోనే సమస్య పరిష్కరించిన మున్సిపల్ అధికారులకు, వార్తను ప్రచురించి అధికారులను అప్రమత్తం చేసి సమస్య పరిష్కరింపచేసిన సాక్షికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

మార్టూరు: మండలంలోని బీసీ కేటగిరీకి చెందిన అభ్యర్థులు ప్రభుత్వం మంజూరు చేసే బీసీ కార్పొరేషన్ రుణాలకు నేటి నుంచి ఈనెల 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వై శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీసీ- ఏ, బీ,సీ,డీ,ఈ ఆర్థికంగా వెనుకబడిన వారి కోసం రూ.93 లక్షలకు సమానమైన 50 రుణాలు మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అభ్యర్థులు 20 నుంచి 60 సంవత్సరాల వయసు మధ్య కలిగిన వారై ఉండాలని ఆయన తెలిపారు. ఆన్‌లై పద్ధతిలో అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, నేరుగా ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

అద్దంకి మున్సిపాలిటీ పరిధిలో..

అద్దంకి/జే.పంగులూరు/మేదరమెట్ల: మున్సిపాలిటీ పరిధిలోని బీసీ, ఈడబ్ల్యూఎస్ కులాల వారికి స్వయం ఉపాధి పథకం ద్వారా ప్రభుత్వం రుణాలు మంజూరు చేయనున్నట్లు కమిషనర్ రవీంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన బీసీ, ఈ డబ్ల్యూఎస్ కిందకు వచ్చే సామాజికవర్గాల వారు ఆన్‌లైన్‌లో దరఖాసస్తులు పంపాలని కోరారు.

- కొరిశపాడు మండలంలోని 15 గ్రామ పంచాయతీలకు చెందిన వారు బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందేందుకు గాను దరకాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో రాజ్యలక్ష్మీ, జే.పంగులూరు ఎంపడీవో స్వరూపారాణి ఒక ప్రకటనలో తెలిపారు.
- **కారంచేడు:** మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన అర్హత కలిగిన 2024–25 బీసీ యాక్షన్ ప్లాన్, ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి, కమ్మ, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ యాక్షన్ ప్లాన్ (ఈడబ్ల్యూఎస్), బీసీ, కార్పొరేషన్‌ల కింద రుణాలు అందుబాటులో ఉన్నాయని ఎంపీడీఓ కే నేతాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ నెల 8వ తేదీ నుంచి 16వ తేదీ లోగా ఓబీఎంఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ ద్వారా అర్జీలు పెట్టుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. రూ. 2లక్షల నుంచి 8 లక్షల వరకు రుణాలు అందిస్తామన్నారు. వీటిలో 50 శాతం రాయితీ, 50 శాతం బ్యాంక్ రుణంగా అందిస్తామని ఆయన తెలిపారు.

చెన్నకేశవస్వామికి ప్రత్యేక పూజలు



వేటపాలెం: రావూరిపేటలో వేంచేసియున్న చెన్నకేశవ స్వామి వారి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం స్వామి వారిని ప్రత్యేంగా ఆలకంరించి సింహాసనం, పాశురం కార్యక్రమంలో పూజలు నిర్వహించారు. అధిక సఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ధనుర్మాసం సందర్భంగా నెల రోజులపాటు ఆలయంలో ప్రతి రోజూ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

హెచ్‌ఎంపీవీ వైరస్‌పై అవగాహన

పర్చూరు (చినగంజాం): హెచ్‌ఎంపీవీ వైరస్‌పై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు తెలిపారు. హెచ్‌ఎంపీవీ వైరస్‌పై మంగళవారం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అవగాహన కల్పించారు. వైరస్ వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. చిన్నపిల్లలు, వృద్ధుల్లో జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలో ఉన్న వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈసందర్భంగా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ మామిడిపాక హరి ప్రసాద్ ఆధ్వర్యంలో రోగులు, పారిశుద్ధ్య సిబ్బందికి మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సోమేశ్వర్ దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడెడ్ కళాశాలలకూ భోజన పథకం అందించాలి

చీరాల రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు అందిస్తున్న విధంగానే మధ్యాహ్న భోజన పథకాన్ని ఎయిడెడ్ కళాశాల విద్యార్థులకు కూడా అందించాలని వినతి పత్రం అందించారు. ఎయిడెడ్ జూనియర్ కళాశాలల రాష్ట్ర అధ్యక్షుడు గారపాటి పుష్పరాజు, జనరల్ సెక్రటరి చావా రామారావుల ఆధ్వర్యంలో అధ్యాపకులు మంగళవారం ఇంటర్ బోర్డు కమిషనర్ కృత్తిక శుక్లాను కలసి వినతి పత్రం అందించారు. రాధాకృష్ణన్ విద్యాకిట్లతో పాటు మధ్యాహ్న భోజన పథకం అందిస్తే ఎయిడెడ్ కళాశాలల్లో కూడా విద్యార్థులు సంఖ్య పెరుగుతుందనే విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు పుష్పరాజు తెలిపారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

చీరాల డివిజన్
90101 55593 (చీరాల)

Office mail : sakshiongads@gmail.com